క్లుప్తంగా

వైభవంగా రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం



సత్తెనపల్లి: కొమెరపూడి గ్రామంలో రామాలయం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. వైఎస్సార్ సీపీ నాయకులు రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కరరెడ్డి, చిలుకా జైపాల్, నల్లబోతు శివనారాయణ, ఎలవర్తిపాటి షేక్ జైబూన్‌బీ, సంకటి నాగేశ్వరమ్మ, కొరివి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని మాచర్ల రోడ్‌లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగన్నాథస్వామికి వేడుకగా గరుడ వాహన సేవ



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెంలోని సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి పుష్కర కుంభాభిషేక వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం గ్రామ బలిహరణ, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనసేవ ఊరేగింపు వేడుకగా జరిగింది. చాగంటివారిపాలెం శ్రీజగన్నాథస్వామి ఆలయం నుంచి గ్రామంలోకి ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రుద్రవరంలో నేడు అభివృద్ధి పనులు ప్రారంభం



రుద్రవరం(ముప్పాళ్ళ): రుద్రవరం గ్రామంలో రూ.43లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. గతంలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామ సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండరామాలయం వార్షికోత్సవం



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలో కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. యాజ్ఞ బ్రహ్మ శ్రీమాన్ పరుచూరి శ్రీకృష్ణామాచార్యుల శిష్య బృందంతో ప్రత్యేక పూజలు జరిపారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు, అన్నదానం చేశారు. భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

బెల్లంకొండ: వన్నాయపాలెం గ్రామంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలను చేయించారు. పీటలపై కూర్చున్న దంపతులు స్వామివార్లను కల్యాణ మండపంలోకి తీసుకువెళ్లారు. స్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అన్న సంతర్పణ చేశారు.

భర్తీ చేస్తూ.. భవిష్యత్తుకు భరోసా ఇస్తూ..!

పోస్టు ఖాళీ అయితే వెంటనే భర్తీ కావాల్సిందే. సచివాలయం వ్యవస్థతో లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలొచ్చాయి. వలంటిర్ వ్యవస్థతో యువతకు ఉపాధి మార్గం దొరికింది. వైద్య రంగంలో జీరో వేకెన్సీ పాలసీని తీసుకొచ్చి వేలాది మందికి ఉద్యోగాలిస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఖాళీ అయిన వెంటనే పోస్టులను భర్తీ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో వందలాది పోస్టులు భర్తీ చేయడంతో.. చాలా మంది మహిళల భవిష్యత్తుకు భరోసా దొరికింది.



పెదకూరపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్న కార్యకర్తలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త, వర్కర్ ఉద్యోగాలు
- ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తున్న ప్రభుత్వం
- పారదర్శకంగా నియామకాలు
- పెదకూరపాడు నియోజకవర్గంలో 26 కార్యకర్తలు, 77 హెల్పర్ పోస్టులు

పెదకూరపాడు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులు వెంటనే భర్తీ చేసి అనేక మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా విప్లవాత్మక మార్పునకు నాంది పలికారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని 75త్యాళ్ళూరు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 77 హెల్పర్ పోస్టులు, 26 మంది అంగన్‌వాడీ కార్యకర్తల నియామకాలు జరిపారు. వారిలో కొందరి ఆయాలకు ఉద్యోగోన్నతి కల్పించారు.

నియోజకవర్గంలో ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు కల్పన వివరాలు

సంవత్సరం	అంగన్‌వాడీ కార్యకర్త	హెల్పర్లు	మొత్తం
2019–20	03	15	18
2020–21	07	10	17
2021–22	03	19	25
2022–23	12	18	30
2023–24	01	15	16

హెల్పర్ ఉద్యోగం వచ్చింది



ఉపాధి లేక ఆందోళన పడుతున్న సమయంలో నాకు హెల్పర్‌గా ఉద్యోగం వచ్చింది. నాకు, నా కుటుంబాన్నికి ఆర్థిక భరోసా కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నికి వచ్చే పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటున్నాను.

–షేక్ హస్మ, పెదకూరపాడు

పారదర్శకంగా నియామకాలు



అంగన్‌వాడీ నియామకాలను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టింది. అంగన్‌వాడీ హెల్పర్ నుంచి కార్యకర్తగా ఎలాంటి సిఫార్సు లేకుండా ఉద్యోగోన్నతి వచ్చింది. నాలాగే చాలా మందికి ఉద్యోగోన్నతులు పొందారు.

–షేక్ కరిమూన్, పెదకూరపాడు

ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ



అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవలకు ఆటంకం ఏర్పడకుండాపోస్టులు భర్తీ చేస్తున్నాం. ఖాళీలు ఏర్పడిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు జరుపుతున్నాం. నాగున్నరేళ్లలో అనేక మందికి పోస్టులు ఇచ్చాం.

–స్వర్ణ, సీడీపీఓ, 75త్యాళ్ళూరు ప్రాజెక్టు

సుఖ వ్యాధుల నివారణపై అవగాహన



వీధినాటకం ప్రదర్శిస్తున్న కళాజాత బృందం

నకరికల్లు: ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపితే చట్టపరంగా శిక్షార్హులవుతారని కళాజాత బృందం సభ్యులు వివరించారు. కళాజాత బృందం హెచ్ఐవీ, ఎయిడ్స్, రక్తదానం, సుఖ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో శనివారం వీధి నాటకం ప్రదర్శించారు. రాష్ట్ర ఎయిడ్స్ నివారణా, నియంత్రణ విభాగం ఆదేశానుసారం కళాజాత నిర్వహించారు. ఐసీటీసీ కేంద్రాలలో లభించే వైద్య సేవలు, క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎం.కోమలి, ఔట్‌రీచ్ వర్కర్ డి.జయలక్ష్మి, పీర్ ఎడ్యుకేటర్‌లు డి.మనీషా, మరియమ్మ, కళాజాత బృందం సభ్యులు వీర్నాల మల్లికార్జునరావు, వి.కాశీనాథ్, ఎం.శివరామకృష్ణ, వి.మల్లయ్య, వి.వెంకటలక్ష్మి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానం

క్రోసూరు: కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జై భారత్ పబ్లిక్ స్కూల్ నందు సోమవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు మండల కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే నంబూరుశంకరరావు పాల్గొంటారని, ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు విద్యా పోకడలు అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. 28 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానంచేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యకు పేదరికం అడ్డు కాకూడదు



ఉపకార వేతనాలు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పెదకూరపాడు: ప్రతిభ గల విద్యార్థులకు పేదరికం అడ్డు కాకూడదని రాష్ట్ర ఆడిట్ డిపార్టుమెంట్ ఉప సంచాలకులు కె.సుబ్బారావు అన్నారు. పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981 నుంచి 1986 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు.. స్థానిక జనచైతన్య సమితి సహకారంతో విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు శనివారం ఉపకార వేతనం శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థి, నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరపనేని రమేష్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఏటా 6 నుంచి పదో తరగతి చదివే ప్రతిభ కనబర్చే విద్యార్థులకు రూ.60వేల వరకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు నల్లూరి అప్పాజీ, దాసరి విజయబెంజిబాబు, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటరమణ, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వెంకటనాగరాజు, జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పెదకూరపాడు: స్థానిక కాకతీయ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సేవా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నవ మరియరాణి, జోసఫ్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ అశోక్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు, సమాజం పట్ల బాధ్యత పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ కరీం, అధ్యాపకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

అచ్చంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రతిభావంతులైన పదిమంది విద్యార్థులకు గుంటూరు మలబార్ గోల్డ్ ప్రతినిధులు శనివారం ఒక్కొక్కరికి రూ.10వేలు నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జె.పద్మ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు వచ్చిన మలబార్‌గోల్డ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొనసాగుతున్న చేరికల పర్వం

టీడీపీని వీడిన గణపవరం వాసులు



పార్టీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: సంక్షేమం, సంస్కరణల పాలనకు ప్రజలు అండగా ఉన్నారని, రానున్నది జగనన్న ప్రభుత్వమేనని నమ్మి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన ఆరు కుటుంబాల టీడీపీ నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. గణపవరానికి చెందిన దామవరపు నాగేశ్వరరావు, మద్దిపోగు వెంకటేశ్వర్లు, మద్దు యాకోబు, ఏసోబు, పోలు అనిల్‌లకు మంత్రి అంబటి రాంబాబు స్వయంగా పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కష్టపడి పని చేయాలని సూచించారు. మంత్రి అంబటితోపాటు రాజుపాలెం మండల అభివృద్ధి కమిటీ సభ్యులు మర్రి సుబ్బారెడ్డి, బాసు లింగారెడ్డి, నాయకులు పక్కాల సూరిబాబు, తేలుకుట్ల చంద్రమౌళి, తోట లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

పుస్తకాలు, పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ

అచ్చంపేట: తాళ్లచెరువు ఎస్సీ కాలనీలోని ఆర్సీఎం పాఠశాల విద్యార్థులకు లీగల్ అవేర్‌నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి పుట్టి అంతోనిరాజు శనివారం పలక, ప్యాడ్, నోట్‌బుక్స్, పెన్సిల్స్ పౌష్టికాహారం వినియోగానికి కావలసిన స్టీలు గిన్నెలు బహూకరించారు. పాఠశాల ప్రతాధానోపాధ్యాయుడు తుమ్మా శేర్రెడ్డి, డాక్టర్ సుశీల, జోజమ్మ తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



ఊటుకూరులో పర్యటిస్తున్న కల్యాణచక్రవర్తి

ఊటుకూరు(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు, పార్టీ యువనేత నంబూరు కల్యాణ్ చక్రవర్తి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఊటుకూరు గ్రామంలో శనివారం పర్యటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్నందున నాయకులు, కార్యకర్తలు ప్రచారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, ఎంపీగా పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించుకుందామని కోరారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

నేడు దొడ్లేరులో కల్యాణ మండపం ప్రారంభం

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో నిర్మించిన రాయపాటి కల్యాణ మండపం ప్రారంభోత్సవం ఆదివారం జరుగుతుందని మండప నిర్మాణ కర్తలు డాక్టర్ రావిపాటి సాయికృష్ణ, డాక్టర్ హారిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మసీదు, మదర్సా ప్రారంభం

మండలంలోని దొడ్లేరు గ్రామంలోని కొండూరు రోడ్డు నందు నూతనంగా నిర్మించిన మసీదు, మదర్సాల ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామ ముస్లిం పెద్దలు శనివారం తెలిపారు. ఇష్తితాహే మస్జీద్ అక్సా అవుర్ మదరసా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గుంటూరు నుంచి ఉలేమా హజ్రత్ మౌలానా ముజ్మిల్ అహ్మద్, సత్తెనపల్లి హజరత్ ముఫ్తి అష్రష్ అహ్మద్, అజీజుర్ రహ్మాన్ అబ్దుల్ బాసిత్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

ఆర్బీకేల్లో కందుల కొనుగోలు కేంద్రాలు



కంది పంటను పరిశీలిస్తున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: కంది పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ గ్రామాలలో కల్లాల్లో ఉన్న కంది పంటను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధర రూ.9,750లకు నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ–పంట నమోదు మేరకు కంది పంటను విక్రయించుకునే రైతులు ఆర్బీకేలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కందులలో తేమశాతం, శుభ్రత, సరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు రైతుల పంట శాంపిల్స్‌ను సిబ్బందితో కలిసి సేకరించారు. ఈ కార్యక్రమంలో జీడీఎంఎస్ సిబ్బంది నాంచారయ్య, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగాదేవి పేరంటాలమ్మ తిరునాళ్ల

- భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఆలయంలో ఎమ్మెల్యే శంకరరావు పూజలు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో ఎత్తైన కొండగుహలో స్వయంభుగా వెలసిన శ్రీగంగాదేవి పేరంటాళమ్మతల్లి తిరునాళ్ల శనివారం అత్యంత వైభవంగా జరిగింది. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు, సతీమణి వసంత కుమారి, కుమారుడు కల్యాణ చక్రవర్తి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామకోటిరెడ్డి ,పూజారులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజారులు అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించారు. వేకువ జామునుండే భక్తుల అమ్మవారిని దర్శించుకలునేందుకు బారులు తీరారు. ఆలయం ముందు యాదవ సోదరులు వీరతాడు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలచింది.

మండలంలోని 150 అడుగుల ఎత్తైన కొండ గుహలో వెయ్యి సంవత్సరాల క్రితం శ్రీ గంగమ్మ తల్లి స్వయంభుగా వెలిశారని, అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా మాఘ శుద్ధి పౌర్ణమిరోజున అమ్మవారికి తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఉండే చెరువును ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంథశిరి గ్రామాల వారు సేద్యపు నీరుగా వినియోగించుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. అందువల్లనే ఈ తిరునాళ్ల వేడుకలను మూడు గ్రామాలవారు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

తెల్లవారు జామునుంచే..

తెల్లవారు జాము 5 గంటల నుంచి అమ్మవారి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు, జనివాడ చదరంగం పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ కార్య నిర్వహణాధికారి కోటిరెడ్డి పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనం టికెట్లుకు, కొబ్బరికాయల విక్రయాలకు, అమ్మవారికి సమర్పించే చీరె, జాకెట్ ముక్కల విక్రయాలకు ప్రత్యేక కొంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకునేందుకు ఆలయం వద్ద ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. అచ్చంపేట పీహెచ్‌సీ సిబ్బంది ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. అచ్చంపేట సీఐ కరిముల్లాషావలి ఆధ్వర్యంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల నుంచి ఓర్వకల్లు వరకు ప్రత్యేక వాహనాలు నడిపారు.

ఐక్యతతో అనిల్‌ను గెలిపించుకుంటాం

వైఎస్సార్ సీపీ యాదవ సంఘ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

అచ్చంపేట:వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపీగా గెలిపించుకుంటామని మండల యాదవ సంఘ నాయకులు ముక్తకంఠంతో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం క్రోసూరు మర్కెట్‌యార్డు డైరెక్టర్ మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల ఆత్మీయ సదస్సుకు ప్రజాదరణను చూసి, ఓర్వలేక టీడీపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పనకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లి.. అడ్డుపడిన వ్యక్తి చంద్రబాబు నాయుడేనని గుర్తుచేశారు. జనరల్ సీట్లలో కూడా బీసీలకు ప్రాధాన్యం కల్పించింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఎంపీగా అనిల్‌ను రెండు లక్షలకు పైగా మెజార్టీతో గెలిపించుకుంటామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, సత్తెమ్మతల్లి దేవస్థాన కమిటీ అధ్యక్షులు వెంకటనరేష్, మాజీ అధ్యక్షుడు గుదారి గోపి, వైస్ ఎంపీపీ తెల్లమేకల నాగరాజు, మర్రి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్స్ పంపిణీ



స్కాలర్ షిప్స్‌కు ఎంపిక అయిన విద్యార్థులు

బెల్లంకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థునులు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్కాలర్‌షిప్స్‌కు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్స్‌పల్ బి.ఉమాదేవి తెలిపారు. శనివారం గుంటూరులో మాజేటి రామ్ కల్యాణ మండపంలో స్కాలర్‌షిప్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10వేలు, 8వేలు చొప్పున ఎంపికై నట్లు తెలిపారు. గత ఆరేళ్లగా మలబార్ సంస్థ వారు కళాశాలలో ఉత్తమ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్స్‌కు ఎంపికైన వారిని గుంటూరు జిల్లా డీఆర్‌వో పెద్ది రోజా, రాజమండ్రి డీఎస్పీ టీవీ రత్నస్వామి, పెద్ది రమణరావు, గుంటూరు డీవీఈవో పద్మ, ఆర్ఐవో జుబేర్ అభినందించారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.08కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు భూమిపూజ చేశారు. స్థానిక వైకుంఠపురం సమగ్ర తాగునీటి పథకం అవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇంటింటికి కుళాయి వేయటంతో పాటుగా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం త్వతగతిన పూర్తి చేసి ప్రజలకు నిత్యం సురక్షిత తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. భూమిపూజ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ పి.రాజేశ్వరి, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్‌బాబు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త ధాన్యంతో పొంగళ్ల నైవేద్యం

నేడు అంకమ్మ తల్లి తిరునాళ్ల



మూల విరాట్ అంకమ్మతల్లి

రాజుపాలెం: రాజుపాలెంలో కొలువుదీరిన అంకమ్మతల్లికి ఏటా ఫిబ్రవరి ఆఖరి ఆదివారం అత్యంత వైభవంగా తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. కారంపూడి వీర్ల దేవాలయంలోని వీరుల ఆయుధాల (దైవాలను)ను తిరునాళ్ల ముందు (శనివారం రాత్రి)రోజు తీసుకువచ్చి ఇక్కడ పురవీధుల్లో ఊరేగిస్తూ, ఉగ్రూతలూగుతూ సేవచేస్తారు. పాడిపంటలు, భోగ భాగ్యాలతో చల్లగా చూసే తల్లికి కులమతాలకు అతీతంగా తొలి ధాన్యపు కంకుల పొంగళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం మహిళలు బ్యాండ్ మేళ్లాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. సాయంత్రం నుంచి విద్యుత్ ప్రభలు, కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాగారం చేస్తారు. ఈ ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని వివిధ రంగులతో ముస్తాబు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీ అంకమ్మతల్లి బ్రహ్మోత్సవాలు త్రయాహ్నిక దీక్షతో అత్యంత వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆచారం. అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అర్చకులు అర్వపల్లి కోటినారాయణమూర్తి తెలిపారు.తిరుణాళ్లలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సయ్యద్ సమీర్ బాషా ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.